# తొలగిన మబ్బులు

కథ

ఒక్కసారిగా సన్నజాజుల పరిమళం గది నిండా వెదజల్లడంతోపాటుగా ట్యూబ్ లైటు ఆరిపోయి లేత నీలి వెలుగులు గది నిండా పరుచుకున్నాయి.

చదువుతున్న పుస్తకం ప్రక్కన పెట్టక తప్పలేదు. తల తిప్పి పక్కకు చూస్తే రతీదేవిలా అపర్ణ. నా ప్రియ సహచరిణి. ముద్దు ముద్దుగా ప్రక్కన చేరింది.

''ఏమండీ''

''ఊ...''

''నే చెప్పింది ఏమాలోచించారు?''

''ఊ''

''ఆ...ఊ..ఏమిటి? ఏం మాట్లాడరేం?''

''ఏం మాట్లాడను? నువ్వడిగిన కైకేయి వరాన్ని నేనెలా తీర్చగలను?''

''చాల్లెండి మరీ బడాయి, నేనేం మీ అమ్మను అడవులకు పంపమనలేదే. అజ్ఞాతవాసం చెయ్యమనలేదే. నెల నెలా డబ్బు పంపిద్దామంటున్నాను కదా. అయినా..ఆవిడ పల్లెలో పుట్టి పెరిగిందే కదా! అక్కడే సౌఖ్యంగా ఉంటుంది. మనం అప్పుడప్పుడూ వెళ్ళి చూసి వస్తుండవచ్చు.'' అంటూ అతని ముఖంలోకి చూసింది.

మౌనమే అతని సమాధానం.

''సరే. రేపు ఉదయాన్నే నేను మా ఊరు వెళ్తున్నాను. బాగా ఆలోచించుకోండి'' అంటూ గోడవైపునకు తిరిగి పడుకుంది.

ఆ రాత్రికి ఇక మాట్లాడదు.

జంటలో ఒంటరి నిశ్శబ్దం ఎంత భయంకరం?

సుధాకర్ మౌనంగా ఇంటికప్పుకేసి చూస్తుండిపోయాడు. ఎంతో అణుకువ, తనంటే ప్రేమ ఉన్న అపర్ణకి ఈ పాడు ఆలోచన ఎందుకొచ్చిందో? తను కోరుకున్నది ఇదా? తనకి ఎనిమిది సంవత్సరాలు నిండకముందే నాన్న చనిపోతే ఎవరినీ ఆశ్రయించక, పుట్టింటికి పోకుండా సరదాగా నేర్చుకున్న టైలరింగ్ వృత్తిగా చేసుకొని ఉన్న కొద్ది పొలంతో సాఫీగా జీవనం సాగిస్తూ పొరుగూరు పంపి చదివించింది. ఇంటరు పాసయ్యాక ''అమ్మా నేను ఇక చదవను, నీ కష్టం నేను చూడలేను'' అన్నప్పుడు, ''డిగ్రీలో చేరు కన్నా..నాకింకా చాలా ఓపిక ఉంది. ఇంటరుతో నీకేం ఉద్యోగం వస్తుందిరా పిచ్చి తండ్రీ. ఈ పోటీ ప్రపంచంలో ఇంకా చదవాలి'' అంటూ ప్రోత్సహించి డిగ్రీలో చేర్పించింది. ఆపైన పి.జి. చేసేవరకూ ఊర్కోలేదు. అమ్మ కష్టం ఫలించి పి.జి. అయిన రెండేళ్ళకి లెక్చరర్‌గా పోస్టింగ్ ఆర్డర్ వచ్చినరోజు అమ్మ కళ్ళలో ఆనందం వెల్లివిరిసింది.

అమ్మను చూసి కన్నీరు ఆపుకోలేక అమ్మ భుజంపై నిశ్శబ్దంగా తల ఆనించి ఉండిపోయినపుడు, తను పడిన శ్రమ మరిచి ఆనంద బాష్పాలు రాల్చింది. ''ఇప్పుడు నీకో తోడు కావాలిరా కన్నా'' అంటూ బంగారు బొమ్మ లాంటి పేద ఇంటి పిల్లని వెదికి వెదికి తోడునిచ్చింది. తాను పెంచిన చెట్టునీడలో విశ్రాంతి తీసుకుంటున్న అమ్మని ఇప్పుడు వెళ్ళిపోమని ఎలా చెప్పగలడు. అపర్ణను కూతురులా చూసుకుంటుంటే 'తన తల్లి అందరిలాటిది కాదని ఎంత మురిసిపోయాడు' అంత మంచితనం కూడా పనికిరాదేమో. దీనికి పరిష్కారం ఏమిటో కాలమే నిర్ణయించాలి. అమ్మను మాత్రం పంపను. అపర్ణకే నచ్చ చెప్పాలి' అనుకుంటూ నిద్రలోకి జారుకున్నాడు సుధాకర్.

అపర్ణ ఇంకా నిద్ర లేవలేదు. అది అలక పానుపే. సోఫాలో కూర్చొని పేపరు చూస్తుంటే కాఫీ కప్పుతో వచ్చింది అమ్మ. ''ఒరే.కన్నా మన ఊరు ఓసారి వెళ్ళొద్దామనుకుంటున్నాను రా'' అంటూ ప్రక్కనే కూర్చుంది.

ఉలిక్కిపడ్డాడు సుధాకర్. కొంపతీసి అపర్ణ అమ్మతో గానీ..డైరెక్టుగా వెళ్ళిపొమ్మని చెప్పిందా? లేక రాత్రి మా సంభాషణ విన్నదా? అని ఆందోళనగా చూశాడు అమ్మ వైపు. కానీ ఆమె చాలా మామూలుగా, ప్రశాంతంగానే కనిపించింది.

''ఇది అమ్మకు వచ్చిన ఆలోచనలాగే ఉన్నది'' అని సర్దుకున్నాడు.

''ఇప్పుడెందుకమ్మా! దసరా సెలవులకి ముగ్గురం వెళ్ళవచ్చులే'' అన్నాడు.

''అప్పటి వరకూనా. నాకేమిటో ఇప్పుడే వెళ్ళాలని ఉంది. ఒక్కసారి అత్తయ్యా వాళ్ళందరినీ చూడాలనుంది. ఈరోజే వెళ్తాను. అపర్ణ ఇంకా లేవ లేదులా ఉంది'' అంటూ లేచింది.

మరేమీ మాట్లాడలేకపోయాడు సుధాకర్. తన సమస్యకి పరిష్కారం దొరికిందనో..తల్లి అపర్ణ ఉద్దేశ్యం గ్రహించిందనో..మౌనంగా ఉండిపోయాడు.

★★★

బస్సు కదలుతుండగా ''అమ్మా త్వరగా వచ్చెయ్యి. నువ్వు లేకపోతే మాకేం తోచదు'' అన్నాడు గిల్టీగా ఫీలవుతూ.

ఒక్కసారి కొడుకు ముఖంలోకి చూసిన ఆ తల్లి మనసు పిచ్చిప్రేమతో నిండిపోయింది. గొంతు పెగలక 'అలాగే' అన్నట్టు తలూపింది. కదిలే బస్‌లోంచి చేయి ఊపింది.

కిటికీలోంచి కదిలే దృశ్యాల్ని చూస్తూ చిన్నగా నవ్వుకుంది. 'పిచ్చి తండ్రి రాత్రి నిద్రపట్టక దొర్లుతున్న తను వాళ్ళ సంభాషణ పూర్తిగా విన్నదనుకోలేదు కాబోలు. త్వరగా రమ్మంటున్నాడు' అనుకొంది.

జన్మజన్మల బంధం, రుణానుబంధం లాంటివన్నీ పిచ్చిమాటలే.

కొడుకు తల్లికి రుణం తీర్చుకోవడమేమిటి? ఏ బిడ్డా నన్ను పుట్టించమని ఏడవడుకదా. అలాగే ఏ తల్లీ తండ్రీ కూడా పిల్లల్ని కనాలనే ఆలోచనతో దగ్గర కాలేరు కదా! అంతా రొటీన్ కార్యక్రమాలే. మిమ్మల్ని కనీ..పెంచి, పెద్ద చేశాం మమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూసుకోండని ఏ తల్లిదండ్రులూ డిమాండ్ చెయ్యగూడదు. కన్నందుకు తప్పనిసరిగా వాళ్ళని తీర్చిదిద్దాలి. సమాజానికి చీడగా, పీడగా కాకుండా ఉన్నతుల్ని చెయ్యాలి. ''ఇది తల్లిదండ్రుల కృషి'' అని కన్న బిడ్డలకు లేనపుడు దూరంగా ఉండటం ఎంతో మంచిది. అంతమాత్రాన బిడ్డల్ని శపించి శాపనార్థాలు, పెడర్థాలు హంగామా అనవసరం. మనం నాటి మొక్క ఆరోగ్యంగా ఎదిగి ఫలిస్తే ఎవరికి ఆనందం ఉండదు? మనం నాటిన చెట్టు ఫలాలు మనమే తినాలనుకోవటం స్వార్థమే కదా అని ఆలోచించుకున్న ఆ తల్లి పల్లెటూరు చేరి పాత కుట్టు మిషను బైటకు తీసింది.

★★★

అత్తగారు లేకపోతే ఇంకా ఆనందంగా గడపవచ్చు. ఆమె ముందు స్వేచ్ఛగా ఉండలేక పోతున్నాము కదా అనుకొంది అపర్ణ. ఒక్క పడక గదికే అంకితమైన ఆనందం మిగిలిన సమయంలో కూడా పొందవచ్చును. సరదాగా ఉండొచ్చు. అనుకున్న అపర్ణ ఊహలు తలక్రిందులయ్యాయి. సుధాకర్ ఆమెతో ఇది వరకులా ఉండలేకపోతున్నాడు. నాలుగు రోజులు పోతే అతనే మారతాడు. వెనక ముసలమ్మల బెడద ఎంత చిరాకు. తనకేం తెల్సు' అని మిన్నకుండిపోయింది.

ఇద్దరి మధ్య దూరం పెరిగిందే కానీ తరగలేదు. ఒక వారం తర్వాత లగేజీతో రిక్షా దిగుతున్న తల్లిని చూడగానే సంబరపడిపోయింది అపర్ణ.

గబగబా ఎదురెళ్ళి సూట్‌కేసు బ్యాగు అందుకొంది. అత్తగారిని చూచిన సుధాకర్ 'ఉత్తరం రాయకపోయారా అత్తయ్యగారూ, స్టేషన్‌కి వచ్చేవాడిని కదా' అన్నాడు ఆప్యాయంగా.

''వద్దామని అనుకుంటే కదా నాయనా. అనుకోకుండా బయలుదేరి వచ్చాను'' అంది.

'అమ్మా. అన్నయ్యా, వదినా పిల్లలూ బాగున్నారా'

''వాళ్ళకేమమ్మా. వాళ్ళు బాగానే ఉన్నారు. బాగోని

దల్లా నా తలరాతే. వాళ్ళకి నేనొక గుదిబండనైపోయాను.''

'అదేంటమ్మా అలా అంటున్నావు అసలేం జరిగింది' అంది ఆతృతగా.

''ఏం చెప్పనమ్మా. వింటే చిన్న విషయాలుగానే ఉంటాయి. పిల్లలకి మంచాలు చాలడం లేదంటూ వాళ్ళ మంచాలు నా గదిలో వేసింది. నాకేమో స్టోర్ రూమ్‌లో ఒకప్రక్క కేటాయించింది. సరేలే అని అలాగే సర్దుకుపోతున్నాను. మీ నాన్న ముచ్చటపడి కట్టించిన ఇల్లు ఉండటానికి ఆయనకి ప్రాప్తం లేదు. బ్రతికుండీ నాకు లేదు. మొన్నామధ్య కీళ్ళనొప్పులతో బాధపడ్డాను. లేవలేక పోయాను. 'అన్నీ అందించలేక చస్తున్నాం' అని మీ వదినా పిల్లలూ కూడా విసుక్కున్నారు. అన్నయ్య ఆచారిగారిని తీసుకొచ్చి మందు ఇప్పించాక తిరగ్గలుతున్నాననుకో. ఇది ఆవిడకిష్టం లేక పోయింది.

''పట్నం పోరాదూ..కూతురుంది కదా..రోగాలు..రొష్ఠులూ వచ్చినపుడు కూడా మాదగ్గరే ఉండాలా? అంటూ ఏమేమో అన్నాదమ్మా'' అంటూ రాబోయే కన్నీటిని ఆపుకుంది.

''మరి అన్నయ్య ఏమీ అనలేదా అమ్మా..''

''ఏమంటాడు. ఏమన్నా అంటే అమ్మగారింటికి ఉడాయిస్తానంటుంది. దాన్నేమనలేక ఛార్జీలకి డబ్బులిచ్చి చెల్లాయి దగ్గర కొన్నాళ్ళు ఉండి మందులు వాడిరా అమ్మా అన్నాడు. వెధవ..వాజమ్మ..కన్నతల్లి కంటే పెళ్ళాం మాటలే ఎక్కువ వాడికి. రేపు వాళ్ళు మాత్రం ముసలి వాళ్ళు అవరా..వాళ్ళకి నేను భారమైపోయానమ్మా'' అంది బాధగా.

''అత్తయ్యగారూ..మీరు అలా బాధపడొద్దు. మా దగ్గర మాత్రం ఎందుకుండగూడదూ. మీ ఇష్టం వచ్చినంత కాలం ఇక్కడుండండి. ఇంట్లో పెద్దవాళ్ళుండటం మంచిది కదా'' అన్నాడు సుధాకర్ అనునయంగా.

అతని ఆప్యాయతకి ఆమె కళ్ళు చెమర్చాయి. ''అలాగే నాయనా..మీ మామగారు మొదటి కాన్పులో మగపిల్లవాడు పుట్టాడని ఎంత మురిసిపోయారో. నేను ఎక్కడికన్నా రెండు రోజులు వెళ్తే అమ్మని కలవరించేవాడు. అయినా..వాడిదేం తప్పులేదు బాబూ..పాతికేళ్ళ కొడుకుని నాకప్పచెప్పింది కదాని కోడలికి ఆమాత్రం లేదు కదా. మీ మామగారి కష్టార్జితంతో ఇల్లు కట్టించి వాడికి నీడనిచ్చారు. ఉన్న కొద్ది పొలాన్ని రెండింతలు చేశారు. అయినా..ఇంకా ''ఏం సంపాదించారూ మాకు'' అని సణుగుతుంది నాయనా. ఇదీ దాని వరస. మీ అమ్మ దేవత కనుక కానీ కట్నం లేకుండా అపర్ణని చేసుకొంది. లేకుంటే వీళ్ళు దాని పెళ్ళి కూడా చెయ్యక పోదురు. ఇప్పుడు వాడేమో చెల్లెలింటికి వెళ్ళిరా..అంటూ సాగనంపాడు. అలా ఉంటాయి కొడుకులిని కన్నవాళ్ళ బాధలు'' అంటూ కళ్ళొత్తుకుంది.

భర్త ముఖంలోకి చూసిన అపర్ణ చటుక్కున తలదించుకుంది. అతని కళ్ళలోకి సూటిగా చూడలేకపోయింది.



అదేం గమనించనట్లే ''అపర్ణా! మీ అమ్మగార్ని హాస్పిటల్‌కి తీసుకెళ్ళి అని టెస్ట్‌లూ చేయించు. మరి నేను వెళ్తాను. కాలేజీ టైమయ్యిందని'' బైటకు వెళ్ళిపోయాడు.

''అపునే...అమ్మాయీ...మీ అత్తగారేదీ కనపడరేం''

''ఊరికెళ్ళారమ్మా ఒక వారం ఉండి వస్తానని చెప్పారు'' అని తప్పించుకుంది. మరింకేమంటుంది. అత్తగార్ని పొమ్మన్నానని చెప్పలేదు కదా.

★★★

లైబ్రరీ వచ్చి మంచంపై కూర్చున్న అపర్ణ అతనేమైనా మాట్లాడతాడేమోనని ఎదురు చూసింది. కళ్ళు మూసుకున్నా అతను నిద్రపోవడం లేదని తెల్సు. అత్తగార్ని పల్లెటూరు పంపమన్నాక అతనెంతో మారిపోయాడని గ్రహించిన అపర్ణ తన తప్పు తెల్సుకొంది. దేవుడి లాంటి భర్త మనసు నొప్పించినందుకు, దేవత లాంటి అత్తగార్ని దూరం చేసుకున్నందుకు పశ్చాత్తాపం మనసును పీడించసాగింది.

నిజంగా అమ్మ అన్నట్టుగా కట్నం లేకుండా ఈ తల్లీ కొడుకులు చేసుకోబట్టి గానీ, లేకుంటే తనకి వదిన కట్నకానుకలిచ్చి పెళ్ళి చెయ్యనిచ్చునా. అయినా..తనెంత ఘూర్ఖంగా ప్రవర్తించింది. మనసులో ఆనందం లేనపుడు ఎంత స్వేచ్ఛ ఉన్నా అనుభవించలేము కదా. తల్లి ఈ పరిస్థితిలో ఇక్కడకు రావడం ఆమెని మరింత పశ్చాత్తాపానికి గురిచేసింది.

''సుధా ఎంత మంచివాడు. 'మా అమ్మని పంపించమన్నావ్. మీ అమ్మమాత్రం ఇక్కడెందుకు' అనలేదు. మరొకరైతే ఎన్ని మాటలందురో కదా. ఇలా ఆత్మ విమర్శ చేసుకుంటున్న ఆమె కళ్ల నుండి బాధ కరిగి కన్నీరౌతుంటే..''ఏమండీ..నన్ను క్షమించరూ'' అంటూ అతని ఎదపై వాలిపోయింది.

''ఛ...ఛ అపర్ణా..ఏడుస్తున్నావా ఇప్పుడేమైందనీ..లేలే..అమ్మని మనమేమీ పొమ్మన లేదుగా. ఆమె స్వతహాగానే వెళ్ళింది'' అన్నాడు ఆమె మనసు అర్థం చేసుకొని.

''ఆమె ప్రేమని, మీ ప్రేమని అర్థం చేసుకోలేని మూర్ఖురాలిని. మీరు ఫస్ట్ బస్‌కే వెళ్ళి అత్తయ్యను తీసుకురండి. మరెప్పుడూ పిచ్చిగా మాట్లాడనుగా. ఐయామ్ వెరీ వెరీ సారీ!'' అంటూ కళ్ళు తుడుచుకుంది.

మబ్బు తొలగిన చంద్ర బింబంలా ఉన్న అపర్ణని దగ్గరగా తీసుకుంటూ ''అలాగే అమ్మని రేపే తీసుకువస్తాలే'' అని అనునయించాడు. ★

ఎం.ఎల్.సూర్యకాంతం